క్లుప్తంగా

మద్యం దుకాణాల తనిఖీ



ముప్పాళ్ళ: ఎమ్మార్పీ ధరకే మద్యం అమ్మాలని, అకౌంట్ రిజిస్టర్లు అప్‌డేట్ చేయాలని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పి.విజయ్‌కుమార్ చెప్పారు. మండలంలోని ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం గ్రామాల్లోని మద్యం దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. దుకాణంలోని సరుకు వివరాలు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. బెల్ట్ షాపులు నిర్వహించరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయా దుకాణాల్లోని రికార్డులను, మద్యం నిల్వలను తనిఖీ చేశారు. ఎస్సై నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో అన్నసంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాల ప్రాంగణంలో జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో దాతల సహకారంతో జరుగుతున్న డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా బుధవారం వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు జవ్వాజి రామమోహన్‌రావు ధర్మపత్ని జవ్వాజి లక్ష్మిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో 120 మంది నిరుపేద రోగులు, వారి సహాయకులకు అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల వైద్యుడు డాక్టర్ అహ్మదుల్లా, నాయకులు కొత్త లక్ష్మయ్య, మారెళ్ళ మల్లేశ్వరరావు, పోతుగంటి నరసింహారావు, తాడువాయి ప్రతాప్, దివ్వెల శ్రీనివాసరావు, సూరే రామకోటేశ్వరరావు, పులిపాటి శ్రీరామమూర్తి, సత్యసాయి సేవా సమితి మహిళా మూర్తులు ఉన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం



పెదకూరపాడు : గర్భిణులకు పౌష్టికాహారం ఎంతో అవసరమని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ అన్నారు. పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు బుధవారం మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్ మాట్లాడుతూ వైద్య పరీక్షలతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకుంటేనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెలుగొండ రెడ్డి, మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్ కుమార్, కొండవీటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద పని దినాలు

బెల్లంకొండ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి వంద పని దినాలు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించామని ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. బుధవారం మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు లేని వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్‌లతో గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని కోరారు. అన్ని గ్రామాలలో పంచ ప్రాధాన్య పనులకు ప్రణాళిక రూపొందించి, ఉపాధి పనులను కల్పించనున్నట్లు తెలిపారు. దినసరి వేతనం రూ.307 ప్రభుత్వం పెంచి ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకాన్ని చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



సత్తెనపల్లి: అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025లో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ధూళిపాళ్ల ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్యశాల, బెల్లంకొండ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు, ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఈ శిబిరంలో సేవలందించారు. వైద్య శిబిరానికి 283 మంది హాజరై వివిధ రకాల పరీక్షలు చేయించుకుని మందులు పొందారు. కొందరికి కళ్లజోళ్లు అందించారు. వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు గ్రహణం

- జగనన్న కాలనీలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- చిట్టడవులను తలపిస్తున్న కాలనీలు
- పట్టించుకోని అధికారులు



అమరావతిలో వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలు



అమరావతి జగనన్న కాలనీ-1లో పెరిగిన కంప చెట్లు



ఎండ్రాయిలో బేస్‌మట్టంలో ఉన్న ఇళ్లు

అమరావతి: రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారం చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వందల కోట్ల రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో కంప చెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. మౌలిక వసతులు కూడా ధ్వంసమై అసాంఘిక కార్యాకలాపాలకు నిలయంగా మారాయి. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

2,536 మందికి ఇళ్ల పట్టాలు

గత ప్రభుత్వ హయాంలో మండలంలోని గ్రామాలలో 22 లే అవుట్‌లలో 2,536 మంది అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వారిలో ఇళ్ల నిర్మాణం చేసుకోవటానికి 1,858 మందిని ఎంపిక చేసి నిర్మాణం మొదలు పెట్టారు. బేస్‌మెంట్ మట్టానికి 632 పూర్తయ్యాయి. ప్రస్తుతం పది ఇళ్లు లెంటిల్ లెవల్‌లోను, 55 ఇళ్లు రూఫ్ లెవల్‌లోను, 303 ఇళ్లకు శ్లాబ్‌లు పూర్తయ్యాయి. ఇంకా 678 మంది లబ్ధిదారులు పలు కారణాల వల్ల ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టాల్సి ఉంది.

నాడు కళకళ

నాడు ఇళ్ల నిర్మాణాలు చకచకా జరిగాయి. బోర్లు, అంతర్గత రోడ్ల నిర్మాణం, కరెంటు స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్‌లు, నీటి ట్యాంకులు ఏర్పాటు.. ఇలా సకల సౌకర్యాలు కల్పించారు. దీంతో జగనన్న కాలనీలు కళకళలాడేవి. కానీ నేడు కూటమి ప్రభుత్వం సుమారు 10 నెలలుగా పట్టించుకోకపోవటంతో ఇళ్లు కడితే బిల్లులు రావేమోనన్న భయంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో ఇళ్ల మధ్య, రోడ్ల పైన కంప చెట్లు పెరిగి చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. పాములు అధికంగా ఉండటంతో లబ్ధిదారులు కాలనీలకు వెళ్లటానికే భయపడుతున్నారు. ప్రస్తుతం లబ్ధిదారులు తాము కట్టుకున్న ఇంటికి కూడా పోలేని పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంప చెట్లు తొలగించి మౌలిక వసతులు పునరుద్ధరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

అమరావతి 1, 2, 3 లే అవుట్‌లు పేకారాయుళ్లు, కోడి పందెందారులు, మద్యం, గంజాయి తాగే వారికి స్థావరాలుగా మారాయి. ఇంటి యజమానులపై ఆకతాయిలు దౌర్జన్యం చేసిన ఘటనలూ లేకపోలేదు. ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు, నీటి మోటార్లు, ఇంటి నిర్మాణానికి వినియోగించే ఇనుము, చివరకు సిమెంట్ కూడా దొంగిలించిన ఘటనలు ఉన్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు అతిగతీలేదు. విద్యుత్ మోటార్లు కనిపించకుండా పోయాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏ స్థాయిలో నిర్మాణం చేసిన ఇంటినైనా వదిలేసి ఊరుకోవటం తప్ప చేయగలిగింది ఏమీలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఇళ్లు కట్టటం ఆపేశారు



ఎన్నో ఏళ్ల నుంచి అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నాం. అమరావతి-1 లే అవుట్‌లో మాకు ఇంటి స్థలం మంజూరు కాగానే నిర్మాణం మొదలు పెట్టి ప్రభుత్వం ఇచ్చిన బిల్లులతో పాటు మిగిలిన మొత్తం అప్పుగా తెచ్చి ఇల్లు పూర్తి చేశాం. కాలనీలో ఇళ్లు కట్టటం పూర్తిగా ఆపేశారు. కంప చెట్లు పెరిగి, రౌడీమూకలు తిరుగుతుండటంతో కాలనీకి వెళ్లటానికే భయపడుతున్నాం.

– తన్నీరు అప్పారావు, అమరావతి

బిల్లులు వస్తాయో రావో



జగనన్న కాలనీలో మాకు ఇంటి స్థలం మంజూరు కాగానే ఎన్నాళ్ల నుంచో ఇల్లు కట్టుకుందామనుకున్న కల నెరవేరుతుందని ఆశపడ్డా. నిర్మాణం మొదలు పెట్టి బేస్‌మట్టం వరకు కట్టాం. బిల్లు రావటం ఆలస్యమైంది. ఇల్లు కట్టుకోవటానికి నీరు లేక అనేక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం బిల్లులు వస్తాయో రావో అని ఇంటి పని ఆపేశాం.

– కారంశెట్టి మేరీ, ఎండ్రాయి, అమరావతి మండలం

కేటాయింపుకు వీలులేదంటున్నారు

ప్రస్తుతం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు వెంటనే చెల్లిస్తున్నాం. కొన్ని కాలనీల్లో కంప చెట్లు విపరీతంగా పెరిగిన మాట వాస్తవం. వాటిని తొలగించటం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులతో సంప్రదించినా నిధుల కేటాయింపుకు వీలులేదంటున్నారు. అలాగే కాలనీల్లో దొంగతనాలపై గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– కె.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ, అమరావతి

ఆదర్శ కమ్యూనిస్టు చంద్ర రాజేశ్వరరావు

నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెదకూరపాడు : మండల పరిధిలోని 75 త్యాళ్లూరు సీపీఐ కార్యాలయం వద్ద బుధవారం స్వాతంత్ర్య సమరయోధులు, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ పోరాట యోధుడు సీపీఐ అగ్రనాయకులు అమరజీవి చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధన కోసం కృషి చేద్దామన్నారు. సంపన్న కుటుంబంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు పేదలు, అణగారిన వర్గాల కోసం ఎర్రజెండా చేతబూని యావదాస్తిని పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాలను పేదలకు పంచి భూపోరాటాల ముద్దుబిడ్డగా పేరు గడించారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు చల్లపల్లి పానయ్య, దొడ్డరాజు, జె.కోటేశ్వరరావు, షేక్ సుభాని, బి.వసంతరావు, దేవ సహాయం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మ



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

బెల్లంకొండ: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరును వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామాలలో నీటి సమస్యను నివారించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో మంచి నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పనిచేయకుండా ఉన్న బోర్లను గుర్తించి మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామాలలో ముమ్మరంగా ఉపాధి పనులు కొనసాగుతున్న తరుణంలో పని ప్రదేశాలలో కూలీలకు వసతులను కల్పించాలని సూచించారు. తాగునీరు ఏర్పాటు చేయాలని, ఎండ ప్రదేశాలలో టెంట్లు వేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ వంద పని దినాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వై.హనుమారెడ్డి, వైస్ ఎంపీపీ షహనాజ్ బేగం, ఎంపీటీసీలు మాదాసు రాంబాబు, చిట్టెంశెట్టి శివనాగమణి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు బాణావతు నరసింహానాయక్, మారెళ్ల సరోజిని, దేసు మల్లేశ్వరి, దారం వెంకటనరసమ్మ, ఈవోపీఆర్డీ గిరిరెడ్డి, ఏపీవో వెంకటేశ్వర్లు నాయక్, పశు వైద్యాధికారి బాలకృష్ణారెడ్డి, ఏవో కృష్ణయ్య, ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్, ఏపీఎం ఉషశ్రీ, ఏఈలు రమణ, ఇబ్రహీం, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహించటం జరుగుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణ రఘురామ్ నగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వాటిని పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యల పరిష్కారదిశగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

కొమెరపూడిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

మండల పరిధిలోని కొమెరపూడి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన గోకుల్ షెడ్, మరమ్మతులు చేసిన ప్రభుత్వ పశు వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బీ, సర్పంచ్ కొరివి అనిల్ కుమార్, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, ఆళ్ల అమరేశ్వరరావు, ఏపీడీ పీవీ నారాయణ, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మంగు శ్రీనివాసరావు, నాయకులు తదితరులు ఉన్నారు.

కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్ట్ అండ్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలిగా రమాదేవి



పిడుగురాళ్ల: ఏంజెల్ ప్రైడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్ట్ అండ్ ఆర్గనైజేషన్ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్‌గా ఓబులాపురం రమాదేవి ఎన్నికయ్యారు. ఏపీ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ ఏంజెల్ ప్రైడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్ట్ ఆర్గనైజేషన్ కార్యవర్గ సమావేశం బుధవారం నరసరావుపేట పట్టణంలోని ఎల్‌బీ కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న శ్రీ రాజన్న సత్రం ఫంక్షన్ హాలులో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పిల్లి జ్ఞనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల పరిధిలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా సంస్థ జిల్లా ప్రెసిడెంట్‌గా ఓబులాపురం రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్



క్రోసూరు(అచ్చంపేట): క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ టి.తులసి, సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం అచ్చంపేట మండలం జడపల్లి మోటుతండా గ్రామ శివారులో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రెండు లీటర్ల నాటు సారా స్వాధీన పరుచుకుని కంచుబోడుతండాకు చెందిన మాడవత్ మారోనిబాయి అనే మహిళను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. మరొక నిందితుడు జడపల్లితండాకు చెందిన మాడవత్ చిన్న కొండానాయక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కిచెన్ గార్డెన్‌తో మహిళలకు ఆదాయం



నకరికల్లు: కిచెన్ గార్డెన్‌తో ఇంటికి నాణ్యమైన కూరగాయలతో పాటు మహిళలకు ఆదాయం లభిస్తుందని ప్రొఫెసర్ నాన్సీ జాస్మిన్ అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కండ్లకుంట గ్రామంలో కిచెన్ గార్డెన్ ప్రాముఖ్యతను వివరిస్తూ బుధవారం ప్రచారం చేపట్టి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా హార్టికల్చర్ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు కిచెన్ గార్డెన్‌లో ఎలా పండించాలో వాటి ప్రయోజనాలు వివరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.విజయకుమార్, ఉద్యానవన అధికారి దాసరి నవీన్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



సత్తెనపల్లి: పట్టణ నాగార్జున నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు పఠాన్‌సోయబ్ ఐఎన్‌టీఎస్ఓ లెవల్-2 ఒలంపియాడ్ పరీక్షల్లో ఆల్ ఇండియా గ్రాండ్ ప్రైజ్ సాధించగా ఆ విద్యార్థికి ల్యాప్‌టాప్, ఫస్ట్ ప్రైజ్ సాధించిన జేవైఎస్ సింగ్‌కి ట్యాబ్‌ను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందించారు. ఒలంపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను బుధవారం అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం అంజయ్య, ఆర్ఐ అప్పాజీ, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మారుతి, ప్రిన్సిపాల్ విశ్వనాథ్, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ రికార్డులు పరిశీలించిన రూరల్ సీఐ



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ పి.కిరణ్

నకరికల్లు: పెండింగ్ కేసులపై దర్యాప్తు వేగవంతం చేసి పరిష్కరించాలని సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ అన్నారు. సత్తెనపల్లి రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా నకరికల్లు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని అన్నారు. సీసీ కెమెరాల నిర్వహణలో ప్రజలు సహకరించాలని సూచించారు. స్టేషన్‌లో కలియతిరిగి మౌలిక వసతులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 550 మందికి పరీక్షలు



వైద్య శిబిరంలో వైద్యుడితో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు: ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. బుధవారం క్రోసూరు జెడ్పీ పాఠశాలలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాటూరి హాస్పిటల్ వైద్యులు మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ పేదల కోసం శిబిరం ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరు తమ ఆరోగ్య సమస్యలు చూపించుకోవాలని కోరారు. శిబిరంలో 550 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మెడికల్ క్యాంప్‌లో జనరల్ మెడిసన్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్టీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ, జనరల్ సర్జన్ విభాగాల వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఓపీ చూపించుకున్న రోగులకు ఈ నెల 14 వరకు కాటూరి హాస్పిటల్‌లో ఉచిత వైద్యం అందించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కారం కాలేదు



సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరోజకు వినతి పత్రం అందిస్తున్న వీఆర్ఏలు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీసాహెబ్

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏల) సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం కాలేదని గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీసాహెబ్ అన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కొరకు దశల వారీ పోరాటంలో భాగంగా బుధవారం సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి ఆర్డీఓ కార్యాలయ ఏవో (పరిపాలనఅధికారి) సరోజకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి గ్రామ రెవెన్యూ సహాయకుల సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి మునాఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు ఎనిమిది సంవత్సరాలుగా జీతాలు పెరగలేదన్నారు. రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రులు మారుతున్నారు కానీ, వీఆర్ఏల సమస్యలు తీర్చేవారు కనిపించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు పేస్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో వీఆర్ఏల గురించి ప్రస్తావనే లేదన్నారు. నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించడం లేదన్నారు. ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వీఆర్ఏలకు వయోభారం పెరుగుతుందన్నారు. దళిత, గిరిజన, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వీఆర్ఏల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ల శాతాన్ని 70 శాతంకు పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేసి, అర్హులైన వీఆర్ఏలకు అటెండర్, నైట్ వాచ్‌మెన్‌గా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నకరికల్లు మండల అధ్యక్షుడు కాసులు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సత్తెనపల్లి వీఆర్ఏలు దేశపతి, రాజు, వెంకటేశ్వర్లు, మురళి, అరుణ్ తదితరులు ఉన్నారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని వినతి

రాజుపాలెం: వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వీఆర్ఏల సంఘం డివిజన్ అధ్యక్షుడు పి.సంజీవరావు, మండల అధ్యక్షుడు లింగాల సిద్ధయ్యలు తహసీల్దారు దుర్గేష్‌రావును కోరారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారుకు వీఆర్ఏల సమస్యలపై వీఆర్ఏల సంఘం అధ్యక్షులు, నాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిదేళ్ల నుంచి జీతాలు పెరగక అవస్థలు పడుతున్నామని, అర్హత గల వారికి ప్రమోషన్‌లు ఇవ్వడం లేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మాపై అదనపు భారం మోపి నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంప్‌ల వద్ద కాపలాలు, రైస్ మిల్లుల డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు. ఇంత చేస్తున్నా టీఏలు, డీఏలు ఇవ్వడం లేదని వాపోయారు. ఖాళీగా ఉన్న వీఆర్ఏ, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులను వీఆర్ఏలచే భర్తీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి వి.రాజు, వీఆర్ఏలు బి.యాకోబు, డి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి భూములకు కౌలు వేలం వాయిదా

6.90 ఎకరాలకు గానూ రూ.70 వేల ఆదాయం

రెంటచింతల: స్థానిక శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం భూములకు స్థానిక శివాలయ ఆవరణలో బుధవారం బహిరంగ వేలం పాటలను నిర్వహించినట్లు ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించిన ఈ వేలంలో దుర్గి మండలం ఓబులేసుపల్లె గ్రామానికి చెందిన దొడ్డా శివగోపి అనే రైతు 6.90 ఎకరాలను 2025–2026 నుంచి 2027–2028 వరకు ఏడాదికి రూ. 70 వేలకు కౌలు హక్కును పొందినట్లు చెప్పారు. గతంలో ఈ పంట భూమికి ఏడాదికి రూ. 36 వేలు కౌలు చెల్లించినట్లు తెలిపారు. దేవస్థానానికి ఉన్న మొత్తం 15.30 ఎకరాల మెట్ట భూమికి గాను మిగిలిన 8.40 ఎకరాలకు వేలం పాట ఈ నెల 11వ తేదీకి వాయిదా పడినట్లు వెల్లడించారు. కౌలు హక్కు పొందిన వారు ముందుగానే ప్రతి సంవత్సరం ఏప్రిల్ 30 తేదీలోపు చెల్లించి భూమిలో ప్రవేశించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పూర్ణచంద్రరావు, లక్ష్మారెడ్డి, సీపీఐ నాయకులు పాశం గోపయ్య, రైతులు పాల్గొన్నారు.

నీటి తొట్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన వెంకటేశ్వర్లు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నీటి తొట్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఏపీఓ జి.చిన వెంకటేశ్వర్లు ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో మేత కోసం పొలాలకు వెళ్లే పశువులకు మంచినీటి వసతిలో భాగంగా మండలానికి 22 నీటి తొట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఒక్కో దాని నిర్మాణానికి రూ.33,220 కేటాయించినట్లు తెలిపారు. పశువులు మేతకు వెళ్లే ప్రాంతంలో నీటి వసతి ఉన్న ప్రదేశంలో తొట్టిని 10 అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని అన్నారు. మండలంలో 10,850 మందికి జాబ్ కార్డులు అందించామని, ఒక్కో గ్రామంలో 30 నుంచి 80 మంది ఉపాధి పనులకు వస్తున్నారని తెలిపారు. కూలీలకు రోజుకు వేతనం రూ.307 ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే మరికొన్ని పనులు చేపట్టేందుకు ఎఫ్ఏలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీరు ఉంచాలని తెలిపారు. ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.